సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 9 । డిసెంబర్ । 2023



ఘనంగా క్షీరాభిషేక సేవ

విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉభయదాతలు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

దేవీపట్నం: స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాళ్లి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



ఘనంగా లక్షపత్రి పూజ

మోతుగూడెం: పొల్లూరు దుర్గా మల్లేశ్వరి ఆలయంలో లక్షపత్రిపూజ, లక్షకుంకుమార్చన, అన్నసమారాధన నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ల నియామకం



అరబీరు జగబంధు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్లుగా భీమవరపు గంగులు, అరబీరు జగబంధు నియమితులయ్యారు.ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామకపు ఉత్తర్వులు శుక్రవారం వెలువడ్డాయి.

ఇంటర్ విద్యార్థిని ప్రసవం

● హుకుంపేటలో ఘటన

హుకుంపేట : ఇంటర్ విద్యార్థిని ప్రసవించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కళాశాల వసతి గృహంలో ఉంటోంది. గురువారం రాత్రి ఆమెకు నొప్పులు రావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డకు మెరుగైన వైద్యం అందించేందుకు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇలావుండగా పాడేరు డిగ్రీ కళాశాలకు చెందిన ఓ విద్యార్థితో ఆమెకు ప్రేమ వ్యవహారం నడుస్తోందని తెలిసింది. అయితే ఆమె గర్భం దాల్చడం, ఇప్పటివరకు కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై డుంబ్రిగుడ మండలానికి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె గర్భం దాల్చిన విషయం తెలియదన్నారు. వార్డెన్ కన్యాకుమారిని వివరణ కోరగా విద్యార్థిని గర్భం దాల్చిన విషయం తమకు తెలియదన్నారు.

కొనసాగుతున్న గాలింపు

● లభ్యం కాని మిరియాల కమల ఆచూకీ



తాటిపూడి జలాశయంలో గాలింపు చేపడుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ లువ్వా గెడ్డలో గల్లంతైన ముగ్గురిలో ఇప్పటివరకు ఇద్దరు ఆచూకీ లభ్యమైంది. వీరికి సంబంధించిన మృతదేహాలను గుర్తించారు. మూడో వ్యక్తి మిరియాల కమల ఆచూకీ కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. అయితే శుక్రవారం ఆమెకు సంబంధించి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో నిలిపివేసిన బృందాలు శనివారం ఉదయం నుంచి గాలింపు చేపడతాయని ఎంపీడీవో శ్రీహర్షిత్ తెలిపారు.

స్త్రీనిధి నిధుల దుర్వినియోగంపై చర్యలు

● ఎనిమిది మండలాల్లో ఉద్యోగుల సస్పెన్షన్

రంపచోడవరం: వైఎస్సార్ క్రాంతి పథంలో స్త్రీనిధి నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ విచారణ జరిపి ఎనిమిది మండలాల్లో ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అడ్డతీగల మండలంలో వీవోఏ డబ్బుకోట వీరబాబు, చింతూరు ఎంఎస్‌సీసీ పి.రవికుమార్, వీవోఏ ఎం.కవిత, ఎం లలిత, కూనవరం సీసీ,వీవోఏ జీఎల్ సుధాకర్, సుజాతను సస్పెండ్ చేశారు. స్త్రీనిధి నిధులు దుర్వినియోగానికి పాల్పడివారిపై చింతూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అడ్డతీగల మండలంలోని భీముడు పాలక మహిళ సంఘం రూ. 9లక్షల మేర నిధుల దుర్వినియోగానికి పాల్పడింది. ఈ సందర్భంగా రంపచోడవరం వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వీవోఏలను విధుల నుంచి తొలగించి, మిగిలిన ఉద్యోగుల నుంచి నిధుల రికవరీకి చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

కందిరీగల దాడిలో ముగ్గురికి అస్వస్థత



కందిరీగల దాడిలో తీవ్ర అస్వస్థతకు గురైన పద్మ

హుకుంపేట: కందిరీగల దాడిలో ముగ్గురు గిరిజనులు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని కొట్నాపల్లి గ్రామానికి చెందిన జన్ని పద్మ, అంజలి, రమేష్ కర్రల సేకరణ నిమిత్తం కొండపైకి శుక్రవారం వెళ్లారు. అక్కడ కందిరీగలు దాడి చేయడంతో తీవ్ర గాయపడ్డారు. వెంటనే అక్కడినుంచి ఇంటికి వచ్చేయడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈదాడిలో జన్ని పద్మ తీవ్ర అస్వస్థతకు గురికాగా మిగిలిన వారి పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

అభివృద్ధి దిశగా ఏవోబీ



మావోయిస్టు ప్రభావిత ఇంజరి పంచాయతీకి నిర్మించిన తారు రోడ్డు



ఏవోబీలో కూంబింగ్‌కు వెళ్తున్న పోలీసు బలగాలు

- అధిక ప్రాధాన్యమిస్తున్న ఆంధ్రా–ఒడిశా ప్రభుత్వాలు
- సమస్యలు పరిష్కరిస్తున్న పోలీసు అధికారులు
- చేరువవుతున్న గిరిజనులు
- కానరాని పీఎల్‌జీఏ వారోత్సవాల ప్రభావం

సాక్షి,పాడేరు : ఏవోబీ వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుండటంతో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గుముఖం పట్టింది. పోలీసుశాఖ అభివృద్ధి నినాదానికి గిరిజనుల నుంచి మంచి స్పందన నెలకొంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చించడంతో మారుమూల ప్రాంతాలకు రోడ్లు, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతికూల పరిస్థితుల కారణంగా మావోయిస్టుల సభలు, సమావేశాల్లో పాల్గొనేందుకు గిరిజనులు ఆసక్తి చూపడం లేదు. ఒడిశాతో పాటు జిల్లా అధికార యంత్రాంగం మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి.గత మూడేళ్లలో మావోయిస్టు పార్టీ నేతలు, సభ్యులు, మిలీషియా సభ్యులంతా భారీగా లొంగిపోవడం వంటి ఘటనలు మావోయిస్టు పార్టీని బలహీన పరచాయి.

పీఎల్‌జీఏకు గిరిజనులు దూరం

మావోయిస్టు పార్టీ ఈనెల ఒకటి నుంచి 8 వరకు నిర్వహించిన పీఎల్‌జీఏ వార్షిక వారోత్సవాలకు గిరిజనులు దూరంగానే ఉన్నారు. పోలీసుల బలగాలు కూడా గాలింపును ముమ్మరం చేశాయి. అడవుల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ పోలీసుబలగాలు అణువణువు జల్లెడపట్టాయి. అయితే మావోయిస్టు పార్టీ నుంచి ఎక్కడ ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. చింతూరు సరిహద్దులోని చత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టు ప్రాబల్యం కాస్త ఉండడంతో పోలీసుశాఖ ఆ ప్రాంతంపై ప్రత్యేకదృష్టి సారించింది. అక్కడ కూడా మావోయిస్టు పార్టీ క్యాడర్ సురక్షిత ప్రాంతాలకే పరిమితమైనట్టుగా తెలుస్తోంది.

ఊపిరి పీల్చుకున్న పోలీసులు



కూంబింగ్ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. అప్రమత్తమైన సరిహద్దు పోలీసులు గత వారం రోజులుగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం ఎస్‌ఐ రవీంద్ర పర్యవేక్షణలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు అంతా పోలీసు బలగాలు మోహరించి కూంబింగ్ నిర్వహించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో గిరిజనులు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

పెదబయలులో విస్తృత తనిఖీలు

పెదబయలు: పీఎల్‌జీఏ వారోత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పెదబయలు నుంచి పాడేరు వెళ్లే ప్రధాన రహదారి పొడవునా కల్వర్టులు,వంతెనలు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు.ప్రభుత్వ కార్యలయాల వద్ద సీఆర్‌పీఎఫ్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

గిరిజనుల అభివృద్ధికి పట్టం



ఏవోబీ వ్యాప్తంగా గిరిజనులు అభివృద్ధిని కోరుకుంటున్నారు. మారుమూల ప్రాంతాలకు రోడ్లు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. గిరిజనులు అభివృద్ధిని కోరుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. పూర్తిస్థాయిలో రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలను అందుబాటులోకి తెస్తున్నాం. విద్య వైద్య రంగాలను మరింత బలోపేతం చేస్తున్నాం.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, పాడేరు

పకడ్బందీగా ఓటరు జాబితా రికార్డులు



మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకుడు శ్యామలరావు

ఓటరు జాబితా పరిశీలకుడు శ్యామలరావు



హాజరైన అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలో పకడ్బందీగా ఓటరు జాబితా రికార్డులు నిర్వహించాలని ఓటరు జాబితా పరిశీలకుడు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఆదేశించారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, బూత్‌స్థాయి అధికారులతో ఓటరు జాబితా తయారీ, రికార్డులు నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. బూత్‌స్థాయి అధికారులు ఎన్నికల జాబితా రికార్డులు నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఓటరు నమోదు, తొలగింపు, మార్పు, చేర్పులకు దరఖాస్తు చేసిన వ్యక్తులకు తప్పనిసరిగా ఎకనాల్జిమెంట్ ఇవ్వాలని సూచించారు. ఓటరు ఫొటోలు సక్రమంగా ఉండాలని, స్టాంపు సైజు ఫొటోలు పెట్టకూడదన్నారు. నాలుగు శాతం, రెండు శాతం ఓటరు తొలగింపు ఉన్న పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్‌వోలు పరిశీలించాలని చెప్పారు. జంక్ క్యారెక్టర్స్, ఒకే ఇంటిలో పది ఓటర్లు ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సవరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తే ఎందుకు తొలగిస్తున్నామనేది సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓటరు జాబితా ప్రక్రియను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అక్టోబర్ 27 నాటికి జిల్లాలో మొత్తం 7,40,573 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అరకులోయ నియోజకవర్గం పాడేరు, నియోజకవర్గం, రంపచోడవరం నియోజకవర్గాల్లో 3,56,969 మంది పురుష ఓటర్లు, 3,83,611 మహిళా ఓటర్లు, ఇతరులు 33 మంది ఉన్నారని వివరించారు. ఈనెల 7వతేదీ నాటికి 22,632 మంది కొత్త ఓటర్లను నమోదు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా మృతులు, శాశ్వతంగా వలస ఓటర్లు 10,459 మందిని జాబితా నుంచి తొలగించామన్నారు. మొత్తం ఓటర్లు 7,52,746 ఉన్నారన్నారు.

రికార్డుల పరిశీలన

అంతకుముందు బూత్‌స్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జీకె.వీధి మండలం జీకె.వీధి, ధారకొండ, అరకువ్యాలీ మండలం అరకువ్యాలీ, చొంపి, పద్మాపురం పోలింగ్ కేంద్రాల రికార్డులను పరిశీలించారు. ఫారం 6, 7, 8లను తనిఖీ చేశారు. ఓటరు జాబితాపై ఓటరు ఫొటో సక్రమంగా ఉండాలని ఆదేశించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ జె.శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లను నియమించాలి

జిల్లాలో రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్లను నియమించాలని ఓటరు జాబితా పరిశీలకులు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు కోరారు. ఎన్నికల అధికారుల సమావేశం అనంతరం వివిధ రాజకీయపార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌ఏజెంట్లను నియమిస్తే లోపాలు లేకుండా ఓటరు జాబితా సవరణకు అవకాశం ఉంటుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీకి రాజకీయపార్టీలు సహకారం అందించాలన్నారు. రాజకీయపార్టీలతో నిర్వహిస్తున్న సమావేశాలకు వివిధ పార్టీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామానికి చెందిన 200 ఓట్లు ఎర్రబొమ్మలు పోలింగ్‌కేంద్రం పరిధిలోకి వెళ్లాయని, రెండు కిలోమీటర్లు పైబడి ఉంటుందని, వాటిని సవరించాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో పీ.అంబేడ్కర్, వైఎస్సార్‌సీపీ నేతలు గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, సీపీఎం ప్రతినిధి ఎల్.సుందరరావు, బీఎస్పీ నేత ఎం.పండన్న, కాంగ్రెస్, బీజేపీ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా నిరోధానికి కార్యాచరణ

మారేడుమిల్లి సీఐ రుద్రరాజు



మారేడుమిల్లి : ఏజెన్సీ ప్రాంతంలోని గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాల్లి పర్యవేక్షణలో గంజాయి రవాణా నిరోధనాకి ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పలు మార్గాల్లో చెక్ పోస్టులు కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. గంజాయి వల్ల జరిగే అనర్థాలు, నష్టాలపై యువత, ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. పర్యాటక ప్రదేశమైన మారేడుమిల్లికి దూర ప్రాంతాలు నుంచి వచ్చే పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తామన్నారు. రిసార్ట్స్, రూమ్స్‌లో అసాంఘిక కార్యకలపాలకు తావులేకుండా ప్రతి వారం తనిఖీలు చేపడతామని తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్య తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మృతురాలు మిరియాల కమల భర్త అప్పన్నను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

అనంతగిరి: లువ్వాగెడ్డలో గల్లంతై మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉండి ఆదుకుంటామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. లువ్వాగెడ్డలో గల్లంతై మృతి చెందిన వారి కుటుంబాలను శుక్రవారం ఆమె పరామర్శించారు. దీనిలో భాగంగా భీంపోల్ పంచాయతీ సీతపాడుకు చెందిన మృతులు గెమ్మెల లక్ష్మి, గెమ్మెల కుమార్ కుటుంబాలను ఆమె ఓదార్చారు. అంతకముందు కాశీపట్నం గోస్తనీ నదిలో మిరియాల కమల కోసం చేపట్టిన గాలింపు చర్యలను ఆమె పరిశీలించారు. ఆమె భర్త అప్పన్నకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. లువ్వాగెడ్డపై వంతెన నిర్మాణానికి కృషి చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులు విన్నవించారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మాలింగవలస, మేడపర్తి వద్ద కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని ఆమెను ఎంపీపీ శెట్టి నీలవేణి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగరాజు, ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, సర్పంచ్‌లు అప్పారావు, భీమ్మలమ్మ, ఎంపీటీసీలు అశోక్, సన్యాసిరావు, కోఆప్షన్ సభ్యుడు మదీనా, మాజీ సర్పంచ్ చిన్నయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి



సర్టిఫికెట్ అందజేస్తున్న కేవీకే కోఆర్డినేటర్ లలితా కామేశ్వరి

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అందిస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్. లలితాకామేశ్వరి అన్నారు. చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తులపై కేవీకేలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఏటా గిరిజన యువత జీవనోపాధి మెరుగుపరిచేందుకు వివిధ రకాల శిక్షణ ఇస్తున్నమన్నారు. చేపలు,రొయ్యలతో విలువధారిత ఉత్పత్తుల తయారీపై ఇప్పటికే మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. మహిళలు ఇంటి వద్దే చేపలు, రొయ్యలతో పచ్చళ్లు తయారీ చేసి మార్కెట్ చేసుకోవచ్చన్నారు. మత్స్యశాఖ శాస్త్రవేత్త డా. వీరాంజనేయులు మాట్లాడుతూ చేపలు, రొయ్యలతో తొమ్మిది రకాల పచ్చళ్లు, కట్‌లెట్‌లు, జంతికలు, అప్పడాలు, వడియాల తయారీపై గిరిజన ఉప ప్రణాళిక నిధులతో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్థిక సమస్యలే యమపాశాలై..

వారణాసిలో కుటుంబం సామూహిక ఆత్మహత్య

8లో

క్లుప్తంగా

నేడు అన్ని పాఠశాలలు తెరవాలి

• ఇన్‌చార్జి డీఈవో గౌరీశంకర్

సాక్షి,పాడేరు: ఇటీవల మిచాంగ్ తుపాను కారణంగా మూడు రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో ఈనెల 9వతేదీన జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు తెరవాలని ఇన్‌చార్జి డీఈవో గౌరిశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం సెలవు లేదని, అన్ని పాఠశాలలు యథావిధిగా పనిచేయాలని ఆయన ఉపాధ్యాయ వర్గాలను ఆదేశించారు.

డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్

సాక్షి,పాడేరు: జిల్లా సర్వే, భూ రికార్డుల కార్యాలయం, డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు.అనంతరం కంప్యూటర్లు, ఇతర మెటీరియల్‌ను ఆయన పరిశీలించారు. తమ నిధుల నుంచి అదనంగా మరో రెండు కంప్యూటర్లు కొనుగోలు చేస్తామన్నారు. భూముల సర్వే డేటా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, డీఆర్వో అంబేడ్కర్ సర్వేశాఖ ఏడీ వై.మోహనరావు, డీఐవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



దేవి

సాక్షి, పాడేరు: పట్టణంలోని బక్కులపనుకులో నివాసం ఉంటున్న మహరాన దేవి(38) గురువారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమైనట్టు పాడేరు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. మధ్యాహ్నం 2గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టు రవి ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. దేవి ఆచూకి తెలిసిన వారు 9440904230 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఆర్థిక సమస్యలే యమపాశాలై..

సాఫీగా సాగుతున్న ఆ కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. అప్పుల బాధ తీరే మార్గం లేక తనువు చాలించడమే శరణ్యమనుకున్నారు. తీర్థయాత్రలకని బయలుదేరిన ఆ కుటుంబం ప్రముఖ పుణ్యక్షేత్రం వారణాసిలో సామూహికంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన సంచలనమైంది.

- వారణాసి వెళ్లి కడతేరిన కుటుంబం
- భార్యాభర్తలు, ఇద్దరు కుమారుల సామూహిక ఆత్మహత్య
- మండపేటలో విషాదం



గుండవరపు కొండబాబు, లావణ్య, వీర వెంకట సూర్య మోహన్‌రాజేష్, జయరాజ్ కృష్ణ (ఫైల్)

కపిలేశ్వరపురం (మండపేట): అమ్మ, నాన్న, ఇద్దరు కుమారులు.. ఉన్నంతలో సుఖసంతోషాలతో బతుకుతున్న కుటుంబం.. ఆర్థిక సమస్యలు పెను భారమయ్యాయి.. అవి తీరే దారి కానరాలేదు.. దీంతో వారి మనసులు కల్లోలభరితమయ్యాయి. ఈ పరిస్థితుల్లో మూడు నెలల క్రితం తీర్థయాత్రలకు బయలుదేరారు. దీనిలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం వారణాసి చేరుకున్నారు. అప్పుల బాధ తీరే అవకాశాలు సన్నగిల్లడంతో ఉన్నట్టుండి ఈ లోకాన్ని వీడాలని నిర్ణయించుకున్నారు. 'కాశ్యాంతు మరణాన్ ముక్తిః' అన్నట్టు.. కాశీ క్షేత్రంలో మరణిస్తే ముక్తి లభిస్తుందనుకున్నారో ఏమో! నలుగురూ కలిసి ఊరు కాని ఆ ఊరిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మండపేటలో కలకలం

ఆలస్యంగా వెలుగు చూసిన కుటుంబం సామూహిక ఆత్మహత్య విషాద ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. మండపేట పట్టణ సీఐ అఖిల్ జామా కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలకు చెందిన గుండవరపు కొండబాబు (50) కొన్నేళ్లక్రితం మండపేటకు వలస వచ్చాడు. పట్టణంలోని పలు షోరూమ్‌ల్లో మోటార్ మెకానిక్‌గా పని చేసి, కొన్నాళ్లుగా సొంతంగా మెకానిక్ షెడ్డు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య లావణ్య (45), కుమారులు వీర వెంకట సూర్య మోహన్ రాజేష్ (25), జయరాజ్ కృష్ణ(23)తో కలిసి మండపేట సప్తగిరి రోడ్డులో నివాసముంటున్నాడు.

ఆర్థిక లావాదేవీల్లో చిక్కుకున్న కుమారుడు

పట్టణంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్న ఓ కుమారుడు ఆర్థిక లావాదేవీల సమస్యలో చిక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులందరూ కలిసి గత సెప్టెంబర్ నెలలో తీర్థయాత్రలకు బయలుదేరారు. పలు ప్రాంతాలు తిరుగుతూ కాశీకి చేరుకున్నారు. అక్కడి ఆంధ్రాశ్రమంలోని కైలాష్ భవన్‌లో ఈ నెల 3న బస చేశారు. అక్కడ ఉంటూ పలు పుణ్య ప్రదేశాలను సందర్శించారు. అంతలోనే మనసుకు ఏం కష్టమొచ్చిందో ఏమో కానీ, కాశీలోనే చివరి శ్వాస వదలాలని నిర్ణయించుకున్నారు. దీంతో బస చేసిన కాటేజీలోనే నలుగురూ సామూహికంగా ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.

గుర్తించిన హౌస్ కీపర్

ఎంతకూ గది నుంచి బయటకు రాకపోవడంతో కాటేజీలో వారు ఉరి వేసుకున్నట్టు హౌస్ కీపర్ గురువారం సాయంత్రం గుర్తించి, అక్కడి దశాశ్వమేథ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. తమకు అప్పులున్నాయని, వాటిపై వేధింపులు బాధించాయంటూ రాసిన సూసైడ్ లెటర్ ఆ కాటేజీలో లభ్యమైనట్టు సమాచారం. మృతుల వద్ద ఉన్న ఆధార్ కార్డుల ఆధారంగా వారణాసి పోలీసులు మండపేట పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై మండపేట పట్టణ సీఐ అఖిల్ జామా పర్యవేక్షణలో పట్టణ ఎస్ఐ అశోక్ శుక్రవారం దర్యాప్తు ప్రారంభించారు. మృతులు నలుగురూ మూడు నెలలుగా ఇక్కడ లేకపోవడం, స్థానికంగా వారికి బంధువులెవ్వరూ లేకపోవడంతో పూర్తి సమాచారం లభ్యం కావడం లేదని పోలీసులు తెలిపారు.

రేపు గవర్నర్ రాక



మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గన్నవరం నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా విశాఖ పోర్టు గెస్టు హౌస్‌కు చేరుకొని కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.07 గంటలకు పోర్టు గెస్టు హౌస్ నుంచి ఆర్‌కే బీచ్‌కు బయలుదేరుతారు. సాయంత్రం 4.12 గంటల నుంచి 5.35 గంటలకు వరకు ఆర్.కె.బీచ్‌లో జరిగే నేవీ డేలో పాల్గొంటారు. 5.35 గంటలకు ఆర్.కె.బీచ్ నుంచి బయలు దేరి నేవీ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ కొద్ది సేపు ఉండి హై టీ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి విమానాశ్రయానికి బయలు దేరుతారు. రాత్రి 7.30 గంటలకు ఐఎన్ఎస్ డేగా నుంచి విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుపానుతో నష్టపోయి కష్టాల్లో ఉన్న బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు.తన క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, చాలాచోట్ల ఇళ్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పంటలు, ఇతర ఆస్తుల నష్టాలపై అధికారులు చేపట్టే సమగ్ర సర్వేలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లంతా భాగస్వామ్యం కావాలన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని.క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారన్నారు. గ్రామస్థాయిలో మనమంతా బాధితులకు తగిన న్యాయం చేద్దామన్నారు. చిన్నపాటి నష్టం జరిగిన బాధితులకు కూడా న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు పాల్గొన్నారు.

వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు

డీసీహెచ్ కృష్ణారావు



ముంచంగిపుట్టు సీహెచ్‌సీని సందర్శించిన డీసీహెచ్ కృష్ణారావు

ముంచంగిపుట్టు: స్థానిక సీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామని డీసీహెచ్ కృష్ణారావు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు.రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల గదిని పరిశీలించి నిల్వల వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌రే ప్లాంట్‌ను అతి త్వరలో వినియోగంలోకి తెస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీ కింద విడుదలైన నిధులు లబ్బూరు పీహెచ్‌సీలో జమ అయ్యాయని వాటిని సీహెచ్‌సీ ఖాతాలో జమచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

- సంక్షేమశాఖ డీడీ జాన్‌రాజ్
- ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలు



గంగవరం ఆశ్రమపాఠశాలల్లో తనిఖీ చేస్తున్న టీడబ్ల్యూ డీడీ జాన్ రాజ్

గంగవరం : గిరిజన విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఉపాధ్యాయులు గిరిజన బాలబాలిక విద్య పట్ల తగిన శ్రద్ధ వహించి నాణ్యమైన విద్యను అందించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలు , వసతి గృహాలను గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలో బాలికలతో మాట్లాడారు.బాలికలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరీక్షలంటే భయపడకుండా రాయాలన్నారు. మంచి ఉత్తీరణత సాధన ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం స్థానిక తనిఖీ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. విద్యా ప్రగతి, పాఠశాల రికార్డులు, వసతి గృహంలో స్టాక్, మౌలిక సౌకర్యాలను, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ప్రధానంగా మెనూ అమలు, సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో విద్యా ప్రగతి తదితర అంశాలను హెచ్‌ఎం గీతాంజలి, ఆర్.వి.సత్యనారాయణ వివరించారు. ఆయన వెంట సహాయ గిరిజన సంక్షేమాధికారి వర ప్రసాద్ ఉన్నారు.

పోస్టుమార్టం సమస్య పరిష్కారం

• రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మెన్‌కు శంకరరావుకు ఎంపీపీ శెట్టి నీలవేణి కృతజ్ఞతలు

అనంతగిరి: అనంతగిరి మండలంలోని ప్రమాదవశాత్తూ మృతి చెందిన మృతదేహాలకు సమీపంలో గల ఏరియా ఆస్పత్రుల్లో పోస్టుమార్టం నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీనిపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ డీవీజీ శంకరరావును, ఎంపీపీ శెట్టి నీలవేణి, గత కొద్దిరోజులు క్రితం కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందిస్తూ కమిషన్ ఛైర్మెన్ శంకరరావు మెడికల్ రీజినల్ డైరెక్టర్, ఐజీకి లేఖ రాశారు. దీనిపై స్పందిస్తూ అనంతగిరి పరిధిలోని మృతదేహాలకు ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, రొంపల్లి పరిధిలోని మృతదేహాలకు గజపతినగరం ఏరియా ఆస్పత్రి, జీనబాడు, పినకోట,పెదకోట పరిధిలోని మృతదేహాలకు కోటపాడు, చోడవరం ఏరియా ఆస్పత్రుల్లో పోస్టుమార్టం నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. పోస్టుమార్టం సమస్య పరిష్కారానికి కృషి చేసిన, ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ డీవీజీ శంకరరావుకు, అధికారులకు ఎంపీపీ శెట్టి నీలవేణి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు.

జాతీయ స్పోర్ట్స్‌మీట్‌కు గిరిజన విద్యార్థులు



నేషనల్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన గిరిజన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేశవరావు

పెదబయలు: కర్ణాటక రాష్ట్రంలో జరిగే ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ నేషనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పెదబయలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు ఎంపికయ్యారు. షాట్ పుట్‌కు పి.బుజ్జిబాబు, హైజంప్‌కు జె.చందు, 100 మీటర్ల రన్నింగ్‌కు ఎస్.ఇషక్, లాంగ్ జంప్‌కు కె.భారత్‌నాయుడులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.కేశవరావు తెలిపారు. ఎంపికైన ఆయా విద్యార్థులకు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. పోటీల్లో రాణించి, రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు.

తల్లి చెంతకు చేరిన చిన్నారి

తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు



ఎస్ఐ వద్ద ఉన్న పిల్లాడు

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెంకు చెందిన ఐదు సంవత్సరాల పిల్లాడు మంపలో శుక్రవారం తప్పిపోయాడు. అతడిని స్టేషన్‌కు తీసుకు వచ్చిన ఎస్ఐ రాజారావు వివరాల కోసం ప్రచారం చేశారు. దీంతో బాలుడి తల్లి లక్ష్మి వచ్చి అతడిని తీసుకువెళ్లింది. బాలుడు సరిగా మాట్లాడలేకపోవడంతో పోలీసులు అతని వివరాలు తెలియజేయాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో తప్పిపోయిన బాలుడిది సూరేంద్రపాలెంగా గుర్తించి తల్లికి అప్పగించారు.

ఆత్మీయ సన్మానం



ఎస్‌డీసీగా పదోన్నతి పొందిన శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని వి.ఆర్.పురంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు ప్రభుత్వం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ)గా పదోన్నతి కల్పించింది.పదోన్నతి పొందిన శ్రీధర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చిన్నికృష్ణ, వి.త్రినాథనాయుడు, పలువురు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులంతా దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

కనువిందు.. కొండగుడి పండగ

- వేడుకగా మేరీమాత ఊరేగింపు
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- ముగిసిన ఉత్సవాలు



శిలువతో ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్లు



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: క్రీస్తుకు జన్మనిచ్చి, ప్రపంచాన్ని పునీతం చేసిన మేరీమాతను కనులారా చూడాలని, మాత కరుణ కటాక్షాలు తమపై ప్రసరించాలని భక్తులు పరితపించారు. దూరాభారం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చారు. గంటల కొద్దీ నిరీక్షించి కొండగుడి ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. పాత పోస్టాఫీస్ ప్రాంతంలోని రోస్‌హిల్ కొండపై వెలసిన అమలోద్భవి అమ్మవారిని దర్శించుకోవడానికి అశేష భక్తజనం తరలివచ్చింది. భక్తి పారవశ్యంతో మాతను స్మరిస్తూ.. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్రపీఠాధిపతుల బోధనలు, ఇలా అక్కడ అణువణువునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణ జిల్లాల నుంచి అమ్మ కరుణ కోసం తరలి వచ్చిన ఆరాధకులతో విశాఖ జనపురిగా మారిపోయింది. కుల, మతాలకు అతీతంగా అమ్మవారిని దర్శించుకోవడంతో పరమత సహనం పరిఢవిల్లింది. గత నెల 29న ప్రారంభమైన మేరీమాత ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 4.30, 5.15, 6 గంటలకు దేవాలయం వద్ద ఆంగ్లంలో దివ్యపూజ చేశారు. తెలుగులో ఉదయం 5, 6 గంటలకు దివ్య పూజ జరిపారు. పూజలో ఎక్కువ మంది కన్యస్త్రీలు రాష్ట్రం నలుమూలల నుంచి హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30 గంటలకు గుహవద్ద విశాఖ అగ్రపీఠాధిపతి ఫాదర్ మల్లవరపు ప్రకాష్ సమష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువులతో పాటు నగరంలోని వివిధ చర్చిల ఫాదర్లు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ వద్ద ఉన్న సెయింట్ అలెయిసిస్ పాఠశాల నుంచి అశేష ఆరాధకులు మేరిమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన దేవాలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. ఆరాధకుల సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని ఉంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేరకు బంగారం, వెండి కానుకలు సమర్పించారు. కొంత మంది తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. లూర్థుమాత గుహ వద్ద దివ్యపూజ బలితో మహోత్సవం ముగిసింది.

సాగరతీరం.. సంభ్రమాశ్చర్యం..!

- నేవీ విన్యాసాలు అదుర్స్
- ఆకట్టుకున్న ఫైనల్ రిహార్సల్
- రెప్పవాల్చకుండా చూసిన సందర్శకులు



బాంబుల మోత





విన్యాసాలు వీక్షిస్తూ

సాక్షి, విశాఖపట్నం : సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగన తలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రు మూకలపై నేవీ కమాండోల కదన దూకుడు.. రివ్వును దూసుకొచ్చిన మిస్సైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. గాల్లో చక్కర్లు కొట్టిన హెలికాప్టర్లు.. మొత్తంగా.. ఆర్‌కే బీచ్.. రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాలా రిహార్సల్.. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని.. నింపిన నౌకాదళ విన్యాసాలలో సాగర తీరం సంభ్రమాశ్చర్యాలకు కేంద్రంగా మారింది. నేవీ సాహసికులు ప్రదర్శించిన పలు విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. ప్రతి విన్యాసం అబ్బురపరిచింది. నింగి, నేలా తేడా లేదనేలా సాగిన విన్యాస ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు సరికొత్త అనుభూతిని పొందారు. నేవీ డే సందర్భంగా ఈ నెల 2న నిర్వహించాల్సిన ఫైనల్ రిహార్సల్స్ తుపాను కారణంగా వాయిదాపడ్డాయి. శుక్రవారం నిర్వహించిన తుది రిహార్సల్స్.. గంటన్నర సేపు అలరించాయి. అంతకు ముందు నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేవీ బ్యాండ్‌తో సైలర్స్ అదరగొట్టారు. ఆర్‌కే బీచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన నేవీ తాత్కాలిక కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు విన్యాసాలను పర్యవేక్షించారు. 4న జరగాల్సిన నేవీడే 10వ తేదీకి వాయిదా పడింది. 10న జరిగే నేవీడే ప్రదర్శనలకు ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ తెలిపారు.